www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 1 అక్టోబర్ 2023
5



వైఎస్ఆర్

విద్యార్థులు ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలి

కడప అర్బన్ : నేటి తరం విద్యార్థులు ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక శాంతిగిరి ఆయుర్వేద సిద్ధ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి 200 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వైద్యులు అనంత ప్రహ్లదన్, ఆదర్శ్ అజయ్, సంస్థ మేనేజర్ మనీష్ మోహన్, పుష్పలత పర్యవేక్షణలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కళాశాల కరెస్పాండెంట్ సుబ్బారెడ్డి శిబిరాన్ని ప్రారంభించి విద్యార్థులకు ఆరోగ్యం ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థులకు పలురకాల ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా చికిత్స నిర్వహించారు. నిర్వాహకులు వైద్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శాంతి గిరి వైద్య శాల సిబ్బంది, లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, ఉపాధ్యక్షులు వి. గౌరి శంకర్, కె. సంజీవరెడ్డి, బోగాల కొండారెడ్డి, గునిశెట్టి శ్రీనివాసులు, కె. రాఘవేంద్ర వర్మ పాల్గొన్నారు.

తగ్గిన పసుపు సాగు

పెరిగిన పెట్టుబడి - మద్దతు ధరలు నిల్

సీతారామపురం వద్ద సాగులో ఉన్న పసుపు పంట

ప్రజాశక్తి -చాపాడు

దేశంలోని ముఖ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల్లో పసుపు ఒకటి. దేశీయ వినియోగంతో పాటు కొన్ని వేల టన్నులను విదేశాలకు ప్రతి సంవత్సరమూ ఎగుమతి చేయడంతో పాటు, మందుల తయారీలో, రంగులలో, సౌందర్య సాధనాలలో, ఆధికంగా వినియోగిస్తారు. భారతీయ సంస్కృతిలో పసుపునకు మంచి స్థానం ఉంది. ప్రతి కార్యక్రమంలో పసుపును తప్పక వాడతారు. పసుపు సాగులో భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. పసుపు ఉత్పత్తిలో 80 శాతం వరకు మన దేశానిదే. దేశీయ ఉత్పత్తిలో 40 శాతం వాటా మన ఆంధ్రప్రదేశ్‌ది. మన రాష్ట్రంలో గతంలో సుమారు 16 800 హెక్టార్లలో పసుపు సాగు చేస్తూ 146000 మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించేవారు. అది కూడా కడప, గుంటూరు జిల్లాలో ముఖ్యంగా పసుపు సాగు సాగు చేసేవారు.

గతంలో ఉమ్మడి కడప జిల్లాలోని 21 మండలాల్లో 12500 ఎకరాల్లో రైతులు సాగు చేసేవారు. రెండేళ్ల కిందట ఉమ్మడి కడప జిల్లాలో మండలాల వారీగా హెక్టార్లలో పసుపు సాగును పరిశీలిస్తే మైదుకూరులో 670, దువ్వూరులో 490, చాపాడులో 283, ఖాజీపేటలో 520, బి. మఠంలో 78, సికె దిన్నెలో 413, పెండ్లిమర్రిలో 62 , మైలవరంలో 175, జమ్మలమడుగులో 90, కాశినాయన లో 370, పోరుమామిళ్లలో 235, కలసపాడు లో 75, ఒంటిమిట్టలో 210 ,సిద్ధవటం లో 330 ,నందలూరు లో 156, చిట్వేలు 52 ,పుల్లంపేటలో 88, ఓబులవారిపల్లిలో 19, రాజంపేటలో 142, రైల్వేకోడూరులో 85, రాజుపాలెంలో 40 హెక్టార్లు సాగు అయ్యేది. ప్రతి ఏడాది సాగు ఖర్చులు పెరగడం, దిగుబడి తగ్గడంతో జిల్లాలో ఏటా వందల ఎకరాలు పసుపు సాగు తగ్గుతూ వస్తుంది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 3500 ఎకరాల్లో మాత్రమే పసుపు పంట సాగు అయినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాల్లో సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది మార్కెట్లో వ్యాపారులు ప్రారంభంలో రూ.4500 కొనుగోలు చేసి, రైతులు పసుపు దిగుబడిని పూర్తిగా అమ్ముకున్న తరువాత ధరలు అమాంతం పెంచారు. ఇలాంటి పరిస్థితుల్లో పసుపు పంట సాగు చేసే నష్టాల్లో కూరుకుపోవడంతో ఎందుకని రైతన్నలు ఆసక్తి చూపలేదని తెలుస్తోంది.

నిలకడగా లేని ధరలు...

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సిఎసిపి వారు పసుపు పంటకు కనీస మద్దతు ధర, గిట్టుబాటు ధర నిర్ణయించడం లేదు. జిల్లాలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ లో పసుపు పంటకు మార్కెట్ సౌకర్యం లేదు. మన రాష్ట్రంలో మన జిల్లాతో పాటు దుగ్గిరాల మార్కెట్ యార్డులో అమ్మకాలు జరుపుతారు. ధరల నిర్ణయం పూర్తిగా వ్యాపారుల చేతుల్లోనే. పసుపు గ్రేడింగ్ అధికారులు మాత్రం నామమాత్రంగా అందుబాటులో ఉంటున్నారు. సరైన గిట్టుబాటు ధరలు వచ్చేంతవరకు నిల్వ ఉంచుకునేందుకు నిల్వ సౌకర్యం అందుబాటులో లేదు. గత ఏడాది సాగైన పంటకు ప్రభుత్వం క్వింటాకు రూ. 6750 గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వ ఆధ్వర్యంలో పసుపు పంటను కొనుగోలు చేశారు. అయితే ప్రభుత్వం పసుపు సేకరించిన తరువాత మార్కెట్‌లో క్వింటా రూ. 10వేలకు పైగా పలికింది.

ప్రతి ఏడాదీ తగ్గుతున్న పసుపు సాగు..

దువ్వూరు మండలంలో పసుపు పంట సాగును గమనిస్తే 2018 -2019లో 2500 ఎకరాలు మండలంలో పసుపు పంట సాగు చేయగా ,2019- 2020లో 1800 ఎకరాలు సాగు చేశారు. 2020-2021లో 900 ఎకరాలు, 2021 -22 లో 550 ఎకరాలు, ప్రస్తుతం 290 ఎకరాలలో మాత్రమే పసుపు పంట సాగు చేశారు. జిల్లెల, కానగూడూరు ,పెద్ద జొన్నవరం, రామ సాయి నగర్, గుడిపాడు, భీమునిపాడు, రామాపురం, వెంకుపల్లి, సి. ఎస్ పల్లి, మది రేపల్లె, సంజీవ రెడ్డి పల్లి ప్రతి సంవత్సరం పసుపు పంట తగ్గుతూ వస్తుందని ఉద్యానశాఖ అధికారులు తెలుపుతున్నారు. చాపాడు మండల పరిధిలోను పసుపు సాగు గణనీయంగా తగ్గుముఖం పట్టింది. గత ఏడాది 195 మంది సాగు చేస్తుండగా ఈ ఏడాది వంద మందికి పరిమితమైంది. పసుపు పంట దిగుబడి తగ్గుతుండటం, గిట్టుబాటు ధర లేకపోవడం, 10నెలల పాటు పంటను సంరక్షణ చేయాల్సి ఉండటంతో నష్టాలు వస్తున్నాయని అందువల్ల వేరే పంటలపై మొగ్గుచూపుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. పండిన పంటకు మద్దతు ధర ప్రకటించలేదని, ప్రభుత్వం కొనుగోలు పూర్తి చేయటం లేదని , ధరలు నిలకడగా ఉండటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. . ఇప్పటికైనా ప్రభుత్వం మద్దతు ధర రూ.9 వేల నుంచి రూ. 10 వేల కేటాయించాలని పసుపు పండించే రైతులు కోరుకుంటున్నారు.

సాగు ఖర్చులు అధికమవుతున్నాయి..

పసుపు పంట సాగుకు ఎకరాకు రూ. 80 నుంచి రూ. లక్ష వరకు ఖర్చు అవుతున్నాయి. దిగుబడి మాత్రం 30 నుంచి 35 క్వింటాళ్లు మాత్రమే వస్తుంది. ప్రస్తుతం ఉన్న ధరలకు సాగు ఖర్చులు కూడా రావడం లేదు. రూ. 10,000 ధరకు పసుపు పంటకు ధరలు ఉంటే ఖర్చులు పోను కొద్ది మిగులుతుంది .ప్రభుత్వం పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.

\- రామసుబ్బారెడ్డి, రైతు, సీతారామపురం.

ధరలు లేక సాగు తగ్గించాం..

గతంలో నాలుగు నుంచి ఐదు ఎకరాలలో పసుపు పంటను సాగు చేపడుతూ ప్రస్తుతం తగ్గించాం. ప్రతి ఏడాది గిట్టుబాటు ధర లేక నష్టాలు మిగులుతున్నాయి. దీంతో పసుపు పంట సాగుకు ఆసక్తి తగ్గింది. పసుపు పంట ఏడాదిపాటు సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది .గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇతర పంటలపై ఆధార పడుతున్నాం.

\-మనోహర్ రెడ్డి , చాపాడు.

ప్రజా ఆరోగ్యమే ధ్యేయం : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ /కడప

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్నారని, పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, మేయర్ కె. సురేష్ బాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక మారుతీ నగర్ ప్రాంతంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష అనే కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రారంభించామని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశం ప్రతి పేదవాడికి వైద్యం కూడా వారి గడపకు అందించాలనే ఆలోచనతోనే ప్రతిష్ఠాత్మకంగా మెరుగైన వైద్యం అందించాలని ఆరోగ్య సురక్షను ప్రవేశపెట్టారన్నారు. ప్రతి వాలంటీర్లు, ఎఎన్ఎంలు, గృహసారథులు 15 రోజుల నుంచి ప్రతి గడపకూ వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని అక్కడే ఇంటివద్దే పరీక్షలుచేయించారని చెప్పారు. ఆయా ప్రాంతాలకు సంబంధించి మరి ఎక్కడైనా అర్బన్ హెల్త్ సెంటర్ ఉంటే ఆ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రాంతంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు.15 రోజుల నుంచి సర్వే చేసి తిరిగిన ప్రాంతాల వారందరికీ ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయించామని చెప్పారు. మహిళలకు సంబంధించి గైనకాలజిస్టులు, ఆర్థోపెడిక్ డాక్టర్లు, చిన్నపిల్లల నిపుణులు, ఉన్నారని, కంటికి సంబంధించి, ఇతర ఐదు మంది డాక్టర్లు కూడా ఉన్నారన్నారు. ఈ శిబిరంలో వారి వారికి సంబంధించిన 11 రకాల పరీక్షలను వారికి చేస్తారన్నారు. రాబోవు రోజుల్లో కూడా ఈ అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా అందించాలనే ఆలోచనతో ఆరోగ్య సురక్ష ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నగర మేయర్ కె. సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష అనే కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేస్తూ ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా అని ప్రజలకు ఆరోగ్య రక్షణ కల్పిస్తున్నామన చెప్పారు. తొలుత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్ బి అంజాద్‌బాషా, నగర మేయర్ కె.సురేష్ బాబు లతోపాటు మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ లు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రిబ్బన్ కత్తిరించి, జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీన్ చంద్‌తోపాటు సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, నాయకులు అప్జల్ ఖాన్, నారపురెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ, జిలాని, మల్లారెడ్డి, కిరణ్, కార్పొరేటర్లు రామచంద్రయ్య , రవీంద్రనాథ్ రెడ్డి, రిజ్వాన్, రామకృష్ణారెడ్డి త్యాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.నాగరాజు, వైద్యులు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

- ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర సంఘ పిలుపు పిలుపుమేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నాలుగున్నర సంవత్సరాలు పూర్తయిన ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. రాష్టంలోని 3 లక్షల మంది సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత జిపిఎస్ అనే కొత్త పెన్షన్ విధానాన్ని తీసుకురావడం సిపిఎస్ ఉద్యోగులను మోసగించడమేనన్నారు. జిపిఎస్ వల్ల ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. రాష్టంలోని ఉద్యోగులందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. 2023 జులై నుంచి మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు విడతల డిఎ లను ప్రకటించాలన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలను వాయిదాల పద్ధతిలో కాకుండా ఏక మొత్తంగా చెల్లించాలన్నారు. ప్రాథమిక పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేసిన జిఒ 117ను రద్దు చేయాలన్నారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి పాఠశాల తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన వైఖరి తీరును మార్చుకోవాలన్నారు. పిఎఫ్, ఎపిజిఎల్ఐ రుణాలకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు ఏడాదైనా ారికి డబ్బులను చెల్లించడం లేదన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్‌ను రూపొందించడంతో పాటు ఉద్యోగోన్నతులు చేపట్టాలన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను మంజూరు చేయాలన్నారు. ఆదర్శపాఠశాలల ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్‌ను రూపొందించాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఎన్ని ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వంలో స్పందనలేదన్నారు. త్వరలో ఎపిటిఎఫ్ రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్ రెడ్డి,నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్లు క్రిష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఖాదర్‌బాష, గురయ్య రాష్ట్రకౌన్సిలర్ సురేంద్రనాధరెడ్డి, జిల్లా కార్యదర్శులు, మునివర్ధన్ కుమార్, రమేష్ రెడ్డి, రామ్ భూపాల్‌రెడ్డి, సుబ్బయ్య, జిల్లా ఉపాధ్యక్షులు రంగయ్య ,శ్రీనివాసులురెడ్డి, రామచంద్రారెడ్డి, బాబు, శ్రీనివాసులు జిల్లాకౌన్సిలర్లు సయ్యద్‌బాష, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు ,అబ్దుల్ సత్తార్,బాలజ్యోజి, హరినాథ్ ,మల్లికార్జున, చంద్రశేఖర్, జాన్ సురేష్, విష్ణువర్ధన్, నరసింహారెడ్డి, రామ సుధాకర్ రెడ్డి, బాబుల్ రెడ్డి, ఖాసీం, మణికుమార్‌తో పాటు జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు దాదాపుగా 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

ఎస్ఐ మెయిన్స్ పరీక్షలకు గడువును పొడిగించాలి

కడప అర్బన్ : ఎస్ఐ మెయిన్స్ పరీక్షలకు మూడు నెలల సమయం ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. శనివారం డిప్యూటీ సిఎం అంజాద్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నాలుగేళ్ల పోరాట ఫలితంగా వచ్చిన 6,511 పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి అనేక సమస్యలను సృష్టించి నిరుద్యోగుల గందరగోళానికి పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు అధికారులే కారణమన్నారు. ఈవెంట్స్‌ను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాక పోవడం ఇప్పుడు హడావుడిగా ఈవెంట్స్ జరిపి కేవలం 15రోజుల్లోనే మెయిన్స్ నిర్వహించడం అంటే నిరుద్యోగులను మోసం చేయడానికే అనేది స్పష్టంగా అర్థమవుతుందన్నారు.. తక్షణమే పోలీస్ ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి మొయిన్ పరీక్షలకు రెండు నెలలు గడువు పెంచాలని డిమాండ్ చేశారు. దేహదారుఢ్య, శారీరక సామర్థ్య పరీక్షలు ఈ నెల చివరి వరకు జరుగుతుంటే మరోవైపు మొయిన్ పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే అభ్యర్థుల తమ అభ్యంతరాల పట్ల కోర్టును ఆశ్రయించారని ఇది పరిష్కరించాల్సింది ప్రభుత్వమే అన్నారు. అభ్యర్థులు, వాస్తవిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఫిజికల్ ఈవెంట్స్ మెయిన్స్ మధ్య కనీసం 2 నెలల గడువును పొడిగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం.ఓబులేసు పాల్గొన్నారు.

నిరసనల జోరు!

ప్రజా'దృష్టి'

జిపిఎస్ అమలు వద్దు సిపిఎస్ అమలు కావాలనే నినాదంతో ఉపాధ్యాయుల నిరసనల సునామీని తలపించింది. రెండ్రోజుల కిందట కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసనల దీక్షలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇతర ఉపాధ్యాయ సంఘాలు నిరసనల్ని మరో మెట్టుకు తీసుకెళ్లడం అభినందనీయం. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రతిపక్ష నేత హోదాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ మిన్నంటోంది. దేశంలో చత్తీష్‌గడ్, రాజస్తాన్ రాష్ట్రాల్లో సిపిఎస్‌ను అమలు చేసిన సంగతి తెలిసిందే. సదరు రాష్ట్రాల్లో అమలు చేయగా లేనిది, ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు సాధ్యం కాదో చెప్పాలని నిలదీయాల్సిన అవసరం ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సిపిఎస్ అంశం అజెండాగా మార్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయ సంఘ నాయకులదేనని చెప్పవచ్చు. రెండేళ్ల కిందట చలో విజయవాడ కార్యక్రమానికి వచ్చిన స్పందనతో ప్రభుత్వం ఉలిక్కిపడిన సంగతి తెలిసిందే. గత అనుభవాల నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల దగ్గర నుంచి ప్రతిపక్ష పార్టీల అనుబంధ సంఘాలు తలపెట్టిన ఉద్యమాన్ని పోలీసులతో నిర్వీర్యం చేసే ప్రయత్నాన్ని కొనసా గిస్తుండడం సిగ్గుచేటు. ప్రజాస్వామ్యానికి నిరసనలు, ధర్నాలే ప్రాణవాయువులు. ఇటువంటి ప్రజాస్వామ్యం ఊపిరి చిదిమివేసింది. ముఖ్యమంత్రి జగన్ ప్రతిపక్ష స్థానంలో ఉన్నప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయడం దగ్గర నుంచి వివిధ అంశాలపై శాసనసభ, ప్రజా క్షేత్రంలో తీవ్రస్థాయిలో విభేదించిన సంగతి తెలిసిందే. ఇటువంటి అనుభవాలను కలిగిన నాయకుని హోదాలో ఉంటూ ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీల అనుబంధ, ప్రజా సంఘాల శాంతి యుత నిరసనలు, ధర్నాలు, బంద్‌లు నిర్వహించకుండా అడ్డుకోవడం చెట్టు కింద కూర్చుని ఆ చెట్టు కొమ్మను నరుక్కోవడమే అవుతుందని తెలుసుకోవాలి. గత ప్రభుత్వం చేయలేని సిపిఎస్ హామీని ప్రతిపక్ష నాయకుని హోదాలో తాము అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో చేస్తామని నమ్మబలికి, హామీని అమలు చేయాలని అడిగితే నిర్బ ంధాల్ని ప్రయోగించడం ఇచ్చిన హామీని గాలికి వదిలేయడమే అవుతుంది. యుటి ఎఫ్ దగ్గరి నుంచి అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా సిపిఎస్‌ను అమ లు చేయాలని నినదించడం ఆహ్వానించదగిన పరిణామం. ఇదే తరహా ఐకమ త్యంతో ఉద్యమాన్ని కొనసాగిస్తే సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికార, ప్రతి పక్షంలోని రాజకీయ పార్టీలకు అజెండా నిర్దేశించే అవకాశం ఉంది. ఫలితంగా కార్మికులు తమ హక్కులను సాధించుకునే అవకాశం ఉంటుంది. ఇంతటి సుదీర్ఘ పోరాటం ఇతర ప్రజాస్వామ్య శక్తులకు ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని చెప్పవచ్చు.

\- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

3న బ్లాక్ డేను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలైన హెడ్ పోస్ట్ ఆఫీస్, బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదుట కేంద్ర కమిటీ వామపక్ష రైతు సంఘాల పిలుపుమేరకు నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వామపక్ష రైతు కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, మనోహర్, బి. దస్తగిరి రెడ్డి, ఎం.వి. సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులపై కాల్పులు జరిపి వారి ప్రాణాలను బలి తీసుకున్న ఘటనకు బాధ్యుడైన మంత్రిని బర్త్ రఫ్ చేయనందుకు నిరసనగా దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు, పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్త ప్రయోజనాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 3న బ్లాక్ డే సందర్భంగా 'క్విట్ కార్పొరేట్- దేశ్ కి బచావో' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకులలోని లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్లకు ఉదారంగా అందజేస్తూ, 9 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ పేరుతో రుణమాఫీ చేసిందని చెప్పారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల రుణాలు మాఫీ చేయడానికి మోడీ ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. కార్పొరేట్లకు లాభాలు పెంచి ప్రజల సంపదలు లూటీ చేస్తున్న కార్పొరేట్లను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఎఐటియుసి నగర అధ్యక్షులు మద్దిలేటి పాల్గొన్నారు.

శోభారాణికి డాక్టరేట్ ప్రదానం

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధకురాలు ముదిరెడ్డి శోభారాణికి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు పి.రమాదేవి పర్యవేక్షణలో 'రెండు దశాబ్దాల రాయలసీమ కథాసాహిత్యం- గ్రామీణ జీవితం' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి పేర్కొన్నారు. చింతకొమ్మదిన్నె మండలం పెద్దముసల్ రెడ్డి పల్లెకు చెందిన రమాదేవి 2018 సంవత్సరంలో యూజీసీ జేఆర్ఎఫ్ ద్వారా పిహెచ్‌డిలో ప్రవేశం పొందారు. శోభారాణి పలు జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆమె రాసిన ఇరవైకి పైగా పరిశోధనా వ్యాసాలు వివిధ జాతీయ, అంతర్జాతీయ సాహిత్య పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. డాక్టరేట్ రావడం పట్ల విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య యస్.రఘునాథరెడ్డి, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ఆచార్య టి.రామప్రసాద్ రెడ్డి, తెలుగుశాఖ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందనలు తెలిపారు.

గిరిజనుల సంక్షేమమే సిఎం లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నూరు

గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బలిసింగాయపల్లి పంచాయతీ కైలాసగిరి కోన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలను ప్రయివేట్‌కు ధీటుగా తీర్చిదిద్దామని చెప్పారు. గతంలో నిర్వహించిన గడపగడప కార్యక్రమంలో భాగంగా స్థానికులు కోరడంతో వెంటనే తాత్కాలిక బిల్డింగ్‌లో పాఠశాలను ఏర్పాటు చేసి ఒక ఉపాధ్యాయుడిని నియమించామని చెప్పారు. విద్యార్థులకు చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన కోరారు కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, మండల వైసిపి కన్వీనర్ భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు రఘురాం రెడ్డి సుబ్బారెడ్డి, గంగిరెడ్డి ఎంఇఒ- 2 సునీత, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు

భూముల అన్యాక్రాంతం అన్యాయం

ప్రజాశక్తి- కడప

దళితులతో కలిసి ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బచ్చుంపల్లె దళితులు, పేదలు సాగు చేసు కుంటున్న ప్రభుత్వ భూములను పెద్దలకు ఇవ్వటం అన్యాయమని ప్రభుత్వ భూ పరిరక్షణ అఖిలపక్ష కమిటీ నాయకులు అన్నారు. కడప రూరల్ ప్రాంతమైన బచ్చుంపల్లె గ్రామం రావికుంట చెరువు పోరంబోకు భూములను దళితులు సాగు చేసుకుంటున్నారని, వాటిని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి మామ ప్రతాప్‌రెడ్డి తన వెంచర్ల కోసం ఆక్రమించి దౌర్జన్యంగా రోడ్లు వేయటం సరైందని కాదని వాపోయారు. శనివారం వారు పాలంపల్లె రెవెన్యూ పొలం సర్వే నంబర్ 644లో 88 ఎకరాల రావికుంట చెరువు పరంబోకు భూములను దళితులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో పనిచేసిన జిల్లా కలెక్టర్ కృష్ణ బాబు చెరువు పరంబోకు భూమిలో రోడ్డు వేయకుండా అడ్డుకున్నారని చెప్పారు. ప్రస్తుతం కడప ఎంపీ అవినాష్‌రెడ్డి మామ గండ్లూరు ప్రతాపరెడ్డి బచ్చుంపల్లె చెరువు ప్రక్కన రియల్ ఎస్టేట్ వెంచర్లు నిర్మిస్తున్నారని చెప్పారు. అలాగే బొచ్చెనంపల్లె దళితులు పేదలు సాగు చేసుకుంటున్నా చెరువు పురంబోకు భూములను పంటలు వేయకూడదని తహశీల్దార్ అడ్డుకుంటున్నారని తెలిపారు. కడప రెవెన్యూ డివిజన్ అధికారి ధర్మచంద్రారెడ్డి స్పందించి కడప తహశీల్దార్‌పైనా అవినాష్‌రెడ్డి మామపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ అఖిలపక్ష పార్టీల నాయకులు సిపిఎం బి. నారాయణ, రా మ్మోహన్, అన్వేష్, కాంగ్రెస్ పార్టీ బొజ్జా తిరుమలేష్, బి.ఎస్.పి గుర్రప్ప, ఎం.ఎల్ పార్టీ డబ్ల్యు రాము, మైనార్టీ రైట్స్ ఫోరం దస్తగిరి, హేతువాద సంఘం సిఆర్‌వి ప్రసాద్, రాయలసీమ ఎస్‌సి, ఎస్‌టి హ్యూమన్ రైట్స్ నాయకులు జె.వి.రమణ, ఆంజనేయులు బచ్చుంపల్లె సాగు దారులు కృష్ణ, రవి, ప్రభాకర్, జార్జి, నాగరాజు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సిగ్గుచేటు : ఎస్ఎఫ్ఐ

కడప అర్బన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిస్తే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో నాయకత్వాన్ని విజయవాడకి వెళ్లకుండా ఎక్కడికక్కడ ముందస్తు నోటీసులు ఇచ్చి అడ్డుకోవడం దారుణమని, విజయవాడలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నాయకులను అక్రమంగా అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయించడం దారుణమని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండి సునీల్ కుమార్, సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని యూత్ హాస్టల్ విద్యార్థులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిస్తే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా పోలీసులతో విద్యార్థి సంఘం నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. విద్యార్థినులు అనికూడా చూడకుండా పోలీసులు దారుణంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు 7,8 నెలలుగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలు విడుదల చేయకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. విద్యార్థులకు అండగా ఉంటానన్న జగనన్న నేడు వారి సమస్యలు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. అక్రమ అరెస్టులు, అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం సిగ్గూ వున్న వెంటనే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ యధుభూషణ్‌రెడ్డి

పనుల పూర్తికి ప్రణాళికలు : డ్వామా పీడీ

ప్రజాశక్తి - కడప

ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద జిల్లాలో 2024- 25 సంవత్సరానికి అవసరమయ్యే పనులను, వాటికి సంబంధించిన పని దినాలను అంచనా వేసేందుకు ప్లానింగ్ ప్రాసెస్ చేపట్టామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు యదుభూషణ్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో శనివారం ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకంలో పనిచేస్తున్న అదనపు కార్యక్రమ అధికారులు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్, జూనియర్ ఇంజనీర్లు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిఎఫ్‌టిలకు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి సాధారణ బదిలీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ప్రాంతంలో ఎక్కువ కాలం పని చేసిన ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందిపై ఆరోపణలు వచ్చే అవకాశం ఉన్నందున వారిని జిల్లాలోని 35 మండలాలకు బదిలీ చేయనున్నామని చెప్పారు. గతంలో నాలుగేళ్ల కిందట సిబ్బందిని బదిలీలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత కౌన్సెలింగ్‌లో 35 మంది అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్లను, 32 మంది ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్/ జూనియర్ ఇంజనీర్స్ (సివిల్), 82 మంది కంప్యూటర్ ఆపరేటర్స్ అండ్ అకౌంట్ అసిస్టెంట్,118 మంది టెక్నికల్ అసిస్టెంట్, 33 మంది బేర్ ఫుట్ టెక్నీషియన్స్‌ను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది ఎటువంటి ఫిర్యాదులు, ఆరోపణలు రాకుండా ఈ ప్లానింగ్ ప్రాసెస్ ను అమలు చేసేందుకు కౌన్సెలింగ్ దోహద పడుతుందన్నారు. వచ్చే సంక్రాంతి పండుగ నుంచి మొదలయ్యే పీక్ సీజన్లో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ వేతన దారులకు పథకం కింద విరివిగా పనులు కల్పించి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు వీలవు తుందన్నారు.

ఐదు వికెట్ల తేడాతో కృష్ణా జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్ - 23 మెన్ వన్డే ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా శనివారం వైయస్ రాజారెడ్డి ఎ సి ఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టుపై ఐదు వికెట్ల తేడాతో కృష్ణ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 38.4 ఓవర్లలో 168 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని రోహిత్ 53 పరుగులు చేశాడు. కృష్ణ జట్టులోని సుశాంత్ నాయుడు అద్దంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 169 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన కృష్ణ జట్టు 31.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ చెట్టులోని బ్రహ్మ తేజ 76, దుర్గారావు 45 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని సిద్ధార్థ 2, కార్తికేయ హరి కుమార్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు.

సిఎం వ్యాఖ్యలు హాస్యాస్పదం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను అమలు చేశామని సిఎం జగన్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదమని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోపై సిఎం పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. ప్రతి రైతు కుటుంబానికి ప్రతి ఏటా పెట్టుబడి సాయం కింద రూ. 12,500 ఇవ్వడంతోపాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక శీతల గిడ్డంగి, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. సహకార డెయిరీలకు పాలు సరఫరా చేసే ప్రతి పాడి రైతుకు లీటర్‌కు రూ. 4 బోనస్ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఉందని తెలిపారు. కాని పెట్టుబడి సాయం కింద రూ.7500లు కోత పెట్టి మిగతా హామీలను కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఆరోగ్యశ్రీ అనారోగ్యశ్రీగా మారిందని విమర్శించారు. ప్రత్యేకహోదా సాధించి ఉద్యోగ విప్లవం తెస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఖాళీగా ఉన్న 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. మద్యపాన నిషేధం చేయకుండా మహిళలను మోసం చేశారని చెప్పారు. కరెంటు ఛార్జీలు పెంచనని చెప్పి, 8 సార్లు పెంచినట్లు చెప్పారు. సిఎం జగన్‌రెడ్డి ఇకనైనా అబద్ధాలు చెప్పడం మానుకోవాలని తులసిరెడ్డి హితవు పలికారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం

- వైసిపి మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురం మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని వైసిపి మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో మరోమారు పార్టీ మండల కన్వీనర్‌గా ఎంపిక చేసిన జిల్లా, రాష్ట్ర వైసిపి నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆశీస్సులతో స్థానిక నాయకులు, అధికారుల సహకారంతో మండలాన్ని మరింత ప్రగతిపథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే మండలంలో నూతన ఎమ్మార్వో కార్యాలయం, పోలీస్ స్టేషన్, తహశీల్దార్ కార్యాలయాలకు దాదాపు రూ.5 కోట్లతో అత్యాధునిక భవనాల నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో సచివాలయాలు, ఆర్‌బికెలు, వైయస్సార్ క్లినిక్ లాంటి భవనాలను నిర్మించామన్నారు. సిమెంట్ రోడ్లు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు సుమారు నాలుగు కోట్ల వ్యయంతో పార్క్ నిర్మాణం చేపట్టామన్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం మార్కెట్ యార్డ్ ఆవరణలో నూతన బస్టాండ్ సైతం త్వరలో నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాటర్‌గ్రిడ్ పథకం కింద నూతనంగా ట్యాంకుల నిర్మాణాలు, పైపులైన్ పనులు చురుగ్గా సాగుతున్నాయని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

వైసిపి మండల కన్వీనర్‌గా జగదీశ్వర్‌రెడ్డి

కొండాపురం : వైసిపి కొండాపురం మండల కన్వీనర్‌గా చౌటిపల్లె గ్రామానికి చెందిన వెంగళ జగదీశ్వర్‌రెడ్డిని కేంద్ర కార్యాలయం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరిని పెద్దలు గుర్తుపెట్టుకుని తగిన న్యాయం చేస్తున్నారని అన్నారు. తాను వైసిపి పుట్టినప్పటి నుండి పార్టీలో సామాన్య కార్యకర్తగా చేరి పార్టీ కోసం కష్టపడ్డానని తెలిపారు. తాను పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు, కడప ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సముచిత స్థానం కల్పించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో పార్టీ బలోపేతానికి తన శాయశక్తులా పనిచేస్తానని జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

నేడు గుండె వైద్యంపై సెమినార్ : జెవివి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వరల్డ్ హార్ట్ డే సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం జనవిజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో 'గుండె సమస్యలు-జాగ్రత్తలు-పరిష్కారాలు' అనే అంశంపై వైద్య సెమినార్ నిర్వహించనున్నట్లు జెవివి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వి.వి.శివారెడ్డి, సునీల్ తెలిపారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు పాతకోట శ్రీనాథ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. గుండె ఆరోగ్య సమస్యలపై సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. శివాలయం ప్రక్క ఉన్న నందిని క్లాత్ మార్కెట్‌లో ఉన్న జెవివి కార్యాలయంలో సాయంత్రం 5గంటలకు సెమినార్ ఉంటుందన్నారు. ప్రజలు, విద్యార్థులు, మహిళలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వేముల మండలం శేషన్నగారిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ ఓబిలంకు నాయుడు ఆరవ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ఆయన కుమారుడు నాగేశ్వర నాయుడు దంపతులు ముద్దనూరు రోడ్డులోని విభిన్నప్రతిభావంతుల కార్యాలయంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎస్‌ఐ హుస్సేన్ నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. 30 విభిన్నప్రతిభావంతుల కుటుంబాలకు నాగేశ్వర నాయుడు దంపతులు, బియ్యం, నిత్యవసర సరుకులు ఎస్ఐచే పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా దాతకు విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఐకిరెడ్డి రఘునాథరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గంగయ్య, వేణు, ప్రసాద్ పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనానికి వేలం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాటుసారా కేసులో సీజ్ చేసిన వాహనానికి శనివారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.12,500. వేలంలో 8 మంది పాల్గొన్నారు. రూ.20,000కు పిక్కిలి రమునాథ్ పాట పాడి దక్కించుకున్నారు. అదనంగా జిఎస్‌టి రూ.3,600 ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. బహిరంగ వేలం పాటలో పులివెందుల స్టేషన్ సిఐ రామాంజనేయులు, ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని తాళ్లపల్లె 33కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లు మరమ్మతులు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. తాళ్లపల్లె, గిడ్డంగివారిపల్లె, టి.వెలమవారిపల్లి గ్రామాల్లో సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో బయటి ప్రాంతాల వారికి కాకుండా పరిసర ప్రాంత గ్రామాల ప్రజలకే ఉద్యోగాలు ఇవ్వాలని పలువురు నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఆ మేరకు శనివారం ఆర్టిపిపి సిఇ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కలమల్ల సర్పంచ్ హెచ్చీరా, చిన్న దండ్లూరు సర్పంచ్ రామడు, చిలమకూరు ఎంపిటిసి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

శుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి - వేంపల్లె

శుభ్రతను పాటించి వ్యాధులకు ప్రజలు దూరంగా ఉండాలని సిడిపిఒ సునీత పేర్కొన్నారు. శనివారం స్థానిక శ్రీరంగనగర్ అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటిలోనే కాకుండా చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను కూడా శుభ్రంగా పెట్టుకోవాలని కోరారు. పరిసరాలు శుభ్రతగా ఉండడం సేవతో సమానం అన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాదని చెప్పారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

దోమల స్వైరవిహారం

నీటి నిల్వలే కారణం - దోమకాటుతో దద్దుర్లు - మలేరియా, డెంగీ జ్వరాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల పట్టణంలో దోమలు రోజురోజుకూ విజృంభిస్తున్నాయి. దోమలు బతికేది కేవలం 20 నుండి 30 రోజులే అయినా వాటి వల్ల ప్రజలు అనేక రకాల అనారోగ్యాలకు గురవుతున్నారు. కురుస్తున్న వర్షాలకు పట్టణంలో నీరు ఎక్కడికక్కడ నిలుస్తోంది. నిలిచిన నీటిని దోమలు ఆవాసాలుగా చేసుకుని గుడ్లు పెడుతూ దినదినాభివృద్ధి చెందుతున్నాయి. దోమలు వాటి జీవితకాలంలో దాదాపు పదిసార్లు గుడ్లు పెడతాయి. ఆ మేరకు దోమల వృద్ధి ఎంత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దోమలు మనుషులను కుట్టడం ద్వారా శరీరంపై దద్దుర్లు ఏర్పడి మంట పుట్టిస్తున్నాయని ప్రజలు అల్లాడిపోతున్నారు. అంతేకాక మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 20న ప్రపంచ దోమల నివారణ దినోత్సవం అంటూ ప్రభుత్వాలు, అధికారులు కార్యక్రమాలు నిర్వహించి,

వీధుల్లో దోమలకు ఆవాసంగా నిల్వ ఉన్న నీరు

పట్టణ వీధుల్లో నెలకొన్న అపరిశుభ్రత

ప్రజల ధనాన్ని దుర్వినియోగం చేయడం తప్ప నివారణ చర్యలు శూన్యమని ప్రజలు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు తమ కుర్చీల్లో కూర్చుని టీ తాగడానికి సమయాన్ని కేటాయిస్తున్నారే తప్ప, ప్రజల సమస్యలపై ఏనాడూ స్పందించిన పాపాన పోలేదని ఆరోపిస్తున్నారు. దోమలతో ప్రజలు నరకయాతన అనుభవిస్తుంటే ప్రజాప్రతినిధులు అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రజల నుండి అధికంగా పన్నులు వసూలు చేస్తున్నారేగానీ ప్రజల సమస్యలపై ఎలాంటి చర్యలు లేవని అంటున్నారు. జబ్బు చేస్తే ఆటో ఖర్చులు, ఆస్పత్రి ఖర్చులు భరించలేకున్నామని వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఫాగింగ్ యంత్రాలు కొన్నామని ఫొటోలకు ఫోజులిచ్చారు.. ఎక్కడ అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని వీధుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడంతోపాటు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కలెక్టర్, ఎమ్మెల్యే

రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నట్లు కలెక్టర్ విజయ్ రామ రాజు తెలిపారు. పట్టణ పరిధిలోని నూతన అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్యులతోపాటు రోగులను పరీక్షించారు. కలెక్టర్ మందులను, పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 20వ తేదీ వరకు పట్టణ, మండల పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలో జరుగుతుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. మండల పరిధిలోని నిడుజివ్వి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యక్రమాలలో ఆర్‌డిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రంతుల్లయ్య, మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, వైద్య అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **దువ్వూరు :** మండలంలోని ఇడమడక గ్రామ పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమం జరిగే ప్రదేశాన్ని మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరిశీలించారు. అక్కడ ఏడు రకాల సేవలను ఆయన పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలు గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఓబులేసు, ఎంపిపి కానాల జయచంద్రరెడ్డి, జెడ్పిటిసి కృష్ణయ్య, తహశీల్దార్ రమాకుమారి, ఎంపిడిఒ జగదీశ్వర్‌రెడ్డి, మండల వైద్యాధికారులు సమీరా, సురేష్ బాబు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. **వేంపల్లె :** జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద చేపట్టే వైద్య సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ కోరారు. శనివారం మండలంలోని కత్తులూరు గ్రామంలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. చేపట్టే వైద్య సేవలపై జెసి వైద్యులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రజల ముంగిటకు వైద్య సేవలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పులివెందుల ఆర్‌డిఒ వెంకటేష్, మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, కత్తులూరు సర్పంచ్ పావని, మాజీ సర్పంచ్‌లు ప్రసాద్‌రెడ్డి, ఉత్తయ్య, ఎంపిటిసి కల్యాణి, వైసిపి నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, విశ్వనాథ్, రఘునాథ్‌రెడ్డి, వైద్యురాలు స్వాతిసాయి, ఆరోగ్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



ఖాజీపేట: ప్రజల ఆరోగ్య వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఖాజీపేట : వైసిపి ప్రభుత్వంలో ప్రజా ఆరోగ్యానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని బి.కొత్తపల్లి పంచాయతీలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష అభిలాష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి, రోగుల యోగక్షమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, ఎంపిపి సిద్దిక్, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ మెంబర్ కరీముల్లా, గ్రామ సర్పంచ్ సుబ్బమ్మ, పార్టీ జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి, ఎంపిడిఒ, తహశీల్దార్, మిడుతూరు పిహెచ్‌సి డాక్టర్ సుమన్, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, వాలంటీర్లు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, వైసిపి గ్రామ నాయకులు పాల్గొన్నారు. **ముద్దనూరు :** ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష ప్రజల ఆరోగ్యానికి రక్ష అని జివిఎస్ఎస్ కలెక్టర్ రామునాయక్, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ సచివాలయంలో శనివారం మండల సచివాలయం కన్వీనర్ చింతాటి సుమంత్ యాదవ్, సర్పంచ్ అరుణమ్మ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ నాయకులు రామిరెడ్డి, లక్ష్మిరెడ్డి, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, డాక్టర్ కరిష్మా, దివ్య, లక్ష్మి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **చాపాడు :** ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి టి లక్షుమయ్య సూచించారు. శనివారం మండల పరిధిలోని ఎన్.ఓబాయపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, వైద్యులు రాజేష్ కుమార్, శ్రీవాణి, కావ్య మాధురి, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి శ్రీనువాసులరెడ్డి, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు సివి సుబ్బారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, జయరామిరెడ్డి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల టౌన్ :** మండలంలోని టేకురుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పుల్లివీడు హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో శనివారం స్థానిక వైద్యులు డాక్టర్ ఎస్ .మేరీ ఎలీషా ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి క్యాంప్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, మండల అభివృద్ధి అధికారి వర ప్రసాద్, స్థానిక సర్పంచ్ తిమ్మారెడ్డి రఘు నాథ రెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షులు కల్లూరి రఘునాథ రెడ్డి, బాషా, చెన్ను రాజశేఖర్, ఎంపిటిసి ముత్యాల ప్రసాద్, డాక్టర్ కల్యాణ చక్రవర్తి, కల్లూరి రమణరెడ్డి, బద్వేల్ వ్యవసాయ మార్కెట్ వైస్ ఛైర్మెన్, వైద్యాధికారులు డాక్టర్ వెంకటేశ్వర్లు రెడ్డి జనరల్ సర్జన్, డాక్టర్. బి ప్రీతీ, మెడికల్ ఆఫీసర్, డాక్టర్ నిఖిల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకట సందీప్, పుల్మనాలోజిస్ట్, వైద్య విద్యాధికారులు సాదు వెంకటేశ్వర్లు, సరస్వ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ టి నరసింహారెడ్డి, పోరుమామిళ్ల, సిహెచ్‌ఒ నిర్మలా దేవి, సచివాలయ ఎఎన్ఎం లక్షి నరసమ్మ, సిహెచ్‌ఒ. టి సునీత, అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, సచివాలయం సెక్రటరీ నారాయణ బాబు, సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **ఒంటిమిట్ట :** మండల పరిధిలోని మంట పంపల్లి, సిద్ధవటం మండలంలోని ఉప్పరపల్లిలలో శనివారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచి వాలయ వ్యవస్థ వాలం టరీ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో ఉన్న అనా రోగ్యతో బాధపడే వారిని గుర్తించి వారికున్న ఆరోగ్య సమస్యలను తెలుసుకునే మార్గాన్ని ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్య మంత్రి జగ న్మోహన్ రెడ్డినని అన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి శ్రీకాంత్ రెడ్డి, ఎంపిటిసి నారాయణ రెడ్డి, బొడ్డే రమణ సిద్దవటం మండల కన్వీనర్ నిలకంఠ రెడ్డి, ఉప మండల అధ్యక్షుడు నారపు రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ బాలాజీ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏకుల రాజేశ్వరి రెడ్డి, వైసిపి నాయకులు ఈశ్వరయ్య, కో -ఆప్షన్ సభ్యులు నూర్ బాషా, జెసిఎస్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి ప్రతాప్ నాయుడు రసూల్ ఖాన్ మండలంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. **బి.కోడూరు :** మండలంలోని తంగేడుపల్లి గ్రామ పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కార్యక్రమాన్ని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రతి కుటుంబానికీ రూ. 5 లక్షల మేర ఉచిత వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపిడిఒ, తహశీల్దార్ విద్యాసాగర్, వైద్య సిబ్బంది, డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ ఉదయ్ కిరణ్ ఆరోగ్య మిత్ర ఓ సుధాకర్‌రెడ్డి, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **కలసపాడు :** మండలంలోని చింతలపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్, జడ్‌పిటిసి, ఎంపిపి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపిడిఒ మహబూబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ లిడ్ క్యాప్ డైరెక్టర్ సుదర్శన్, సర్పంచ్ సాధనకారి రామసుబ్బమ్మ, మాజీ ఎంపిపి సుధా రామకృష్ణారెడ్డి, జడ్‌పిటిసి అంకన, గురువిరెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ చిత్తా, ఎంపిపి బోధనబోయిన నారాయణ , వైస్ ఎంపిపి మల్లిక, గురయ్య, మండల వైద్యాధికారులు డాక్టర్ శైలజ, సాయి కుమార్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు హరిప్రియ, రత్నకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్త్ కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా

బాల్య వివాహాల నిర్మూలనకు భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - వేంపల్లె

బాల్య వివాహాలు నిర్మూలించేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం చింతలమడుగుపల్లి గ్రామంలోని వార్డు సచివాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బాల్య వివాహాలతో చాలామంది అనారోగ్యానికి గురవుతున్నారని, మాతృ మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. బాలికలకు బలవంతంగా వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాలపై వాలంటీర్లు దృష్టి పెట్టి అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ప్రజల్లో చైతన్యం తేవాలని ఆయన కోరారు. సమావేశంలో మండల కో-ఆప్షన్ మెంబరు అస్సానయ్య, ఎంపిటిసి పఠాన్ రహంతుల్లా, సచివాలయ కన్వీనర్ నగేష్, మహిళా పోలీసులు సునీత, అర్చన, లక్ష్మిప్రభ, మౌనిక, రోజా, శ్రీలత, మాధవీలత, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఖాజీపేట : బాల్యవివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరమని అంగన్వాడీ పర్యవేక్షక అధికారి జహీరాభి అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తపేట సెక్టర్‌లో బాల్య వివాహాలపై ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహాలు జరుపుతున్నట్లు తెలిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం కనీస వివాహ వయసు వచ్చిన తర్వాత మాత్రమే తమ పిల్లలకు వివాహాలు జరిపించాలని అన్నారు. మహిళలు అన్ని రంగాలలో ముందుంటున్నారని వివరించారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలు చోటు చేసుకుంటాయని తల్లిదండ్రుల అవగాహన పెంచుకొని, ఇలాంటి వాటికి స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో దుంపలగట్టు అంగన్వాడీ కార్యకర్త జంపన గంగావతి, సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : అరికట్టాలని ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ సూచించారు. శనివారం చాపాడు సచివాలయంలో బాల్య వివాహాల నివారణ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలకు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు నిండే వరకు వివాహాలు చేయకూడదన్నారు. సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా బాల్యవివాహాలు చేస్తే కమిటీ సభ్యులు వెంటనే సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ, సచివాలయ సిబ్బంది, ఉర్దూ హైస్కూల్ ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తహశీల్దార్ మహబూబ్ బాషా పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం మండలస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రోషన్, ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఇఒపిఆర్‌డి పద్మనాభరెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి పాల్గొన్నారు.

ట్రాఫిక్ అధికారుల తీరు సరికాదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులోని ట్రాఫిక్ అధికారుల తీరు సరైందికాదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో సరుకు రవాణా వాహనాలను పదేపదే అడ్డుకుంటూ, జరిమానా వేస్తున్నారని, దుకాణాల ముందు సరుకును దించుతున్నప్పుడు వాహనాలు పట్టుకొని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి చలనా వేయడం అన్యాయమన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులో రాత్రి 8 గంటల తర్వాత పదుల సంఖ్యలో ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు రోడ్డుకు అడ్డంగా బస్సులను నిలుపుతున్నా ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల వాహనాలే లక్ష్యంగా మారాయని, ఉపాధి కోసం వాహనాలు నడుపుతున్న వారిపై ఇలాంటి చర్యలు తగవనిన్నారు. ప్రయివేట్ ట్రావెల్స్ వాహనాలను తక్షణం సీజ్ చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు పట్టణానికి రెండు కిలోమీటర్ల అవతల నిలపాలని చట్టంలో ఉన్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడంలేదన్నారు. దీన్ని బట్టి అధికారులు వారికి వత్తాసు పలికినట్లవుతుందన్నారు.

రిలే నిరాహారదీక్షలో ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - చాపాడు

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా మైదుకూరు పార్టీ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు 18 రోజులుగా మైదుకూరులో రిలే నిరాహార దీక్షలు కొన సాగిస్తున్నారు. శనివారం మైదుకూరు నియోజకవర్గ టిడిపి ప్రజా ప్రతినిధులు సర్పంచులు, కౌన్సిలర్లు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు దీక్షలో పాల్గొన్నారు. చేతులకు సంకెళ్ళు వేసుకొని నిరసన తెలిపారు. బద్రిపల్లె సర్పంచ్ మల్లేశ్వరి, కౌన్సిలర్లు లక్ష్మమ్మ, రాధాకృష్ణ, లక్ష్మిదేవి, నారాయణ యాదవ్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సీతంపల్లె సర్పంచ్ వర చంద్రమోహన్, పేట బైరెడ్డి, పి రమణ, పి సుబ్బరాయుడు,ఇ వెంకటేషు, రేగళ్లపల్లె కృష్ణారెడ్డితోపాటు పలువురు దీక్షలో కూర్చున్నారు. వీరికి మద్దతుగా ప్రొద్దుటూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్ రెడ్డి, రాజుపాలెం మండల కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జేబీవుల్లా, మండల కన్వీనర్ బోడెల బాబుల్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్ పాల్గొన్నారు.

- బాబుతో నేను అంటూ చంద్రబాబు అక్రమ అరెస్టుపై ప్రజలకు వివరిస్తూ పట్టణంలోని 36వ వార్డులో శనివారం ఇంటింటికీ తిరుగుతూ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సోమా బాలయ్య, సోమా తిరుమలనాథ్, సోమా తిరుమలయ్య, సోమా పెద్ద తిరుమలయ్య, సారధి, బాలాజీ,38 వార్డ్ ఇట్టే సునీల్‌కుమార్, మాజీ కౌన్సిలర్ పాణ్యం సుబ్బారాయుడు, 34 గోదిన రాఘవేంద్ర, భోగాల మధుబాబు, నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైసిపి మండల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గంగాధర్‌రెడ్డి, హాఫీజ్

వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ మండల అధ్యక్ష నియామకాలు జారీ చేశారు. ఇందులో భాగంగా పులివెందుల క్లస్టర్-1 అధ్యక్షులుగా దాసిరెడ్డి గంగాధర్‌రెడ్డి, క్లస్టర్-2 అధ్యక్షులుగా హాఫీజ్‌ను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పట్ల నమ్మకంతో అధ్యక్షులుగా నియమించినందుకు వైయస్ కుటుంబ సభ్యులకు రుణపడి ఉంటామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అడుగుజాడల్లో తాము అహర్నిశలు పని చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో మరింత కష్టపడి పనిచేస్తామని పేర్కొన్నారు. నిరంతరం పార్టీకి అందుబాటులో ఉంటామన్నారు. ప్రతి కార్యకర్తకు వైసిపి ఎప్పటికీ అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

శ్రీధర్‌రెడ్డి

ముద్దనూరు : మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన నడమల శ్రీధర్‌రెడ్డి వైసిపి మండల అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఆ మేరకు వైసిపి కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు వచ్చినట్లు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధిష్టాన నాయకత్వం తనపై నమ్మకంతో అధ్యక్షులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి 2024 ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేస్తానన్నారు. తనకు పదవి వచ్చేందుకు సహాయసహకారాలు అందించిన ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాజశేఖర్‌రెడ్డి

చాపాడు : వైసిపి చాపాడు మండల కన్వీనర్‌గా చాపాటి రాజశేఖర్‌రెడ్డిని నియమించారు. గతంలో కూడా మండల కన్వీనర్‌గా ఆయన బాధ్యతలు నిర్వహించేవారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డిని మళ్లీ మండల కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించారు. తనపై నమ్మకం ఉంచడంపట్ల ఆయ ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

గండి అంజన్నను దర్శించుకున్న ఎపి సిపిడిసిఎల్ చైర్మన్

ప్రజాశక్తి-చక్రాయపేట

ఎపి సిపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పద్మ జనార్ధనరెడ్డి శనివారం గండి అంజన్నను దర్శించుకున్నారు. ప్రధాన ఉప ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజాస్వామి ఆలయ మర్యాదలతో దర్శనం చేయించి శేష వస్త్రం, స్వామివారి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఒఎస్‌డి ఎస్‌పిటిసిఎల్ శ్రీనివాసులు, డిఇఇ శ్రీకాంత్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE: KADAPA

I.A.No. 607 of 2022 in A.S.No. of 2022

Between:
Cherukuru Nagur Son of Peeraiah, aged about 56 years, Hindu, resident of D.No.3/422, Sai Kuteer Road, Proddatur Town, Kadapa District.

...Petitioner/Appellant

And

2. Peddireddy Ramana Reddy, Son of late Venkata Reddy, aged about 45 years, working in the Kashmir Front Army, permanent resident of Nagalakuntla Village, Akkalreddypalli Post, Porumamilla Mandal, Kadapa District.
3. Desireddy Rama Devi, Wife of Subba Rami Reddy, Hindu, aged about 43 years, House wife, residing at Kapu Street, Porumamilla Town and Mandal, Kadapa District.
4. Veeramreddy Krishna Kumari, Wife of Rama Subba Reddy, Hindu, aged about 40 years, House wife, residing at Kapu Street, Porumamilla Town and Mandal, Kadapa District.
5. Peddireddy Jagan Mohan Reddy, Son of Late Venkata Reddy, Hindu, aged about 35 years, Pharmaceutical research, Plot No.A201, Chandresh Avenue, Lodha Heaven, Dombivili (East) Mumbai-421201, Maharashtra State.

...Respondents

ప్రతివాదులకి నోటీసు

ఇందు మూలంగా తెలియజేయడమేమనగా ప్రతివాది హాజరు నిమిత్తము తేదీ.17/10/2023 ఉదయం. 10.30 గంటలకు పైకోర్టు నందు వాయిదా కలదు. మీ హాజరు కొరకు వాయిదా వున్నది. కావున స్వయంగా కాని, వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలయును లేని యెడల మీ పరొక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

యం. సురేష్ కుమార్
అడ్వకేటు, కడప
సెల్-9440673990

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE: KADAPA

I A No. 1348 of 2022 in
I.A.No. 607 of 2022 in A.S.No. of 2022

Between:
Cherukuru Nagur Son of Peeraiah, aged about 56 years, Hindu, resident of D.No.3/422, Sai Kuteer Road, Proddatur Town, Kadapa District.

...Petitioner/Appellant

And

2. Peddireddy Ramana Reddy, Son of late Venkata Reddy, aged about 45 years, working in the Kashmir Front Army, permanent resident of Nagalakuntla Village, Akkalreddypalli Post, Porumamilla Mandal, Kadapa District.
3. Desireddy Rama Devi, Wife of Subba Rami Reddy, Hindu, aged about 43 years, House wife, residing at Kapu Street, Porumamilla Town and Mandal, Kadapa District.
4. Veeramreddy Krishna Kumari, Wife of Rama Subba Reddy, Hindu, aged about 40 years, House wife, residing at Kapu Street, Porumamilla Town and Mandal, Kadapa District.
5. Peddireddy Jagan Mohan Reddy, Son of Late Venkata Reddy, Hindu, aged about 35 years, Pharmaceutical research, Plot No.A201, Chandresh Avenue, Lodha Heaven, Dombivili (East) Mumbai-421201, Maharashtra State.
9. Bojja Kiran, Son of Late Bojja Rajanna, aged about 33 years, Hindu, Cooli,
10.Bojja Mariya Ratnamma, Wife of Late Bojja Rajanna, aged about 56 years, Hindu, Household,
11. Bojja Mariyamma, Daughter of Late Bojja Rajanna, aged about 22 years, Hindu, Household,
12.Bojja Bharathi, Daughter of Late Bojja Rajanna, aged about 26 years, Hindu, Household,
13.Bojja Velaggine, Daughter of Late Bojja Rajanna, aged about 30 years, Hindu, Household,
Nos. 9 to 13 are resident of Kappadapalli Village, Tekurpet (P), Porumamille Mandal, Kadapa District.

ప్రతివాదులకి నోటీసు

ఇందు మూలంగా తెలియజేయడమేమనగా ప్రతివాది హాజరు నిమిత్తము తేదీ.17/10/2023 ఉదయం. 10.30 గంటలకు పై కోర్టు నందు వాయిదా కలదు. మీ హాజరు కొరకు వాయిదా వున్నది. కావున స్వయంగా కాని, వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలయును లేని యెడల మీ పరొక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

యం. సురేష్ కుమార్
అడ్వకేటు, కడప. సెల్-9440673990.